క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు పయనం



షూటింగ్ బాల్ పోటీలకు పయనమైన జిల్లా జట్టు

సంతకవిటి: రాష్ట్రస్థాయి అండర్–19 షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జట్టు శుక్రవారం పయనమైంది. ఈ నెల 8 నుంచి 10 వరకు బాపట్ల జిల్లా మార్టూరులో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మండల గోవిందరావునాయుడు ఆధ్వర్యంలో బాలబాలికల జట్లు శుక్రవారం బయలుదేరి వెళ్లినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తెలిపారు. క్రీడాకారులు విజయంతో తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు.

శ్రీనివాసుడికి తులసీదళార్చన



వేంకటేశ్వర స్వామికి లక్ష తులసితో అర్చనలు

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధిలో ఉన్న భూనీలా వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామివారికి లక్ష తులసీదళాలతో అర్చన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

తెర్లాం: ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అరసబలగ సర్పంచ్ సాయిరాం, గ్రామ కార్యదర్శి తాజ్‌బేగం అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార పంపిణీ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే సరుకులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్తబుట్టల పంపిణీ




చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

తెర్లాం: గ్రామంలో చెత్త సేకరణలో భాగంగా ప్రతీ ఇంటికి పంపిణీ చేస్తున్న చెత్త బుట్టలను ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని సర్పంచ్ మూడడ్ల పార్వతి అన్నారు. మండలంలోని చీకటిపేట గ్రామంలో శుక్రవారం చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను ఆరుబయట, కాలువల్లో వేయకుండా చెత్తబుట్టలో వేసి, గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బేగం పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి

బాడంగి: పంచాయతీల్లో స్వయంసమృద్ధితో ఆదాయ వనరులను సృష్టించుకొని తద్వారా పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామసభలు, తీర్మాణాలు, ఇంటిపన్ను వసూలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యదర్శులు వారికి అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, టీఓటీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం పి.గోవిందరావు అన్నారు. మండలంలో ఆమదాలవలస గ్రామంలో శుక్రవారం గ్రామైఖ్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. సంఘాల పొదుపు రికార్డులు పరిశీలించారు. పొదుపు నిల్వతో పాటు స్త్రీనిధి రుణాలు వినియోగం, చెల్లింపుపై ఆరాతీశారు. రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



రేగిడి: లక్ష్మీపురంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వి.జగన్మోహనరావు, సర్పంచ్ తేజోవతి, తదితరులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతాయని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని పలు గ్రామసచివాలయాల పరిధిలో శుక్రవారం 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ నేతలతో కలిసి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసే డాష్‌బోర్డులను గ్రామ సచివాలయాల వద్ద ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మళ్లీ రాష్ట్రానికి జగనే ఎందుకు అవసరమో ప్రజలకు వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: పట్టణంలోని 15వ వార్డులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, సవరపు బాబు, తదితరులు



బొబ్బిలి: పక్కి గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జేసీఎస్ ఇన్‌ఛార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు



తెర్లాం: ఉద్దవోలు సచివాలయం వద్ద ప్రభుత్వ పథకాల డాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



బాడంగి: రేజేరులో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలో' వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెంకటనాయుడు



రాజాం: రాజయ్యపేటలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజగోపాలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు, తదితరులు

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం..

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తుపాను ప్రభావంతో నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, ఆర్డీఓ సాయిశ్రీ

రామభద్రపురం: తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో తుపాను ప్రభావంతో దెబ్బతిన పంటలను ఆర్డీఓ సాయిశ్రీతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అధిక వర్షాల వల్ల వరి, కూరగాయల పంటలు దెబ్బతిని పూర్తిగా నష్టపోయామని రైతులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. మండలంలో ఎంత మేర పంట నష్టం జరిగిందని వ్యవసాయాధికారి వెంకటయ్యను ఎమ్మెల్యే శంబంగి ఆరా తీశారు. పంటనష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేసి నివేదిక అందజేయాలని ఏఓను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతి అని, ప్రతీ ఒక్క రైతుకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వారికి ఇబ్బంది పెట్టకుండా మిల్లర్లు కొనుగోలు చేయాలన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశిస్తామన్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా సాయం చేస్తుందని, రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో శనివారం రెండోరోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు చేసిన సంక్షేమ లబ్ధిని వివరించారు. నవరత్న పథకాలతో ప్రతీ కుటుంబానికీ లబ్ధి జరిగిందన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. గ్రామస్తులు చెప్పిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు మరిపి రమేష్ తల్లి పార్వతి అస్వస్థతతో నడవలేని స్థితిలో ఉన్నందున వారి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడారు. అధైర్య పడొద్దని, ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బొబ్బిలి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిపి శంకరరావు, ఉపసర్పంచ్ రెడ్డికృష్ణ, మరడ రమణ, గండి శంకరరావు, యామల శివప్రసాద్, ఎంపీడీఓ ఆంజనేయులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఉద్యోగ విప్లవం

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ హయాంలోనే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల విప్లవం సాకారమైందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని విద్యాన్ డిగ్రీ కాలేజీలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు అనేక విధాలుగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ జాబ్ మేళాకు సుమారు 700 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా.. వారికి వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారిలో 150 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి విశాఖ, విజయనగరం, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని 13 కంపెనీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాన్ కాలేజీ కరస్పాండెంట్ శంబంగి శ్రీకాంత్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నీలం గోవిందరావు, ప్రిన్సిపాల్ నల్ల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఆర్డీఓ సాయిశ్రీ

రామభద్రపురం: పేద రైతులకు సంపూర్ణ శాశ్వత భూ హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండలంలోని 228 మంది పేద రైతుల అసైన్డ్ భూములకు శాశ్వత యాజమాన్య హక్కు పత్రాలను ఆర్డీఓ సాయిశ్రీతో కలిసి శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రాష్ట్రంలోని ఎస్టీ, ఎస్సీ, బీసీ వర్గాల్లోని పేదరైతులకు సంబంధించి లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను 22ఎ జాబితా నుంచి తొలగించి వాటిపై రైతులకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించారన్నారు. ఈ పట్టాలతో బ్యాంకుల్లో రుణాలు పొందడంతో పాటు క్రయ, విక్రయాలు జరుపోకోవచ్చన్నారు. అలాగే వారసులకు ఆస్తిగా ఇవ్వవచ్చునన్నారు. ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఈ యాజమాన్యపు హక్కులకు వర్తిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా భూముల రీ సర్వేలో జరిగిన పొరపాట్లను పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సర్వేలో సాంకేతిక లోపాల వల్ల కొన్ని సమస్యలు వచ్చాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని ఆర్డీఓ సాయిశ్రీ అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 2003 సంవత్సరం కంటే ముందు రైతుల సాగులో ఉన్న భూములకు మాత్రమే పట్టాలు పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, తహసీల్దార్ ఎ.సులోచనరాణి, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు, పెంకి శేఖర్, పాతరేగ ఎంపీటీసీ పెద్దింటి రామినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

- జాతి వైరం మరచి..



తల్లిప్రేమకు జాతి వైరం అడ్డుకాదని చెప్పేందుకు ఈ చిత్రమే నిదర్శనం. ఓ పంది పిల్లకు శునకం పాలిచ్చి ఆకలితీర్చింది. మండలంలోని పటువర్ధనం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తన పిల్లలతో పాటు అక్కడే ఉన్న పంది పిల్లలకు కూడా ఆ శునకం తరచూ పాలిస్తుందని స్థానికులు చెబుతున్నారు. – వంగర

చురుగ్గా ప్రభుత్వ భవనాల నిర్మాణం

బొబ్బిలి: గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బొబ్బిలి, రాజాం, గజపతినగరం నియోజకవర్గాల పరిధిలో రూ.90.30 కోట్లతో 259 సచివాలయ భవనాలు మంజూరు కాగా 167 పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రూ.47 కోట్లతో 249 రైతుభరోసా కేంద్రాలు మంజూరు కాగా 139 పూర్తయినట్లు చెప్పారు. రూ.26.4 కోట్లతో 214 వెల్‌నెస్‌సెంటర్లు మంజూరు కాగా వాటిలో 84 భవనాలు పూర్తయ్యాయన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు

'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిధులతో మూడు నియోజకవర్గాల్లో రూ.30.57 కోట్లతో 986 పనులు మంజూరు కాగా 301 పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇప్పటికే రూ.3.87 కోట్లు చెల్లింపులు అయ్యాయని, మిగతావి కొత్త మాడ్యూల్‌లో అప్‌లోడ్ అవుతున్నాయన్నారు. మరోవారం రోజుల్లో చెల్లింపులు పూర్తవుతాయన్నారు. రూ.7.93 కోట్లతో ఉపాధిహామీ కింద మండలానికి రూ.60 లక్షల చొప్పున పనులు చేపడుతున్నామన్నారు. భోజరాజపురం వద్ద రూ.15 కోట్లతో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే తెర్లాం మండలం కుసుమూరు వద్ద రూ.15 కోట్లతో బ్రిడ్జి మంజూరైందన్నారు. ఆయనతో పాటు డీఈఈ వై.ప్రసాదరావు, హెచ్‌డీ రాంప్రసాద్, జేఈ రుక్మాంగధనాయుడు ఉన్నారు.

నేడు టాటా సన్స్ ఈసీ చంద్రశేఖర్ సందర్శన

రాజాం: స్థానిక జీఎంఆర్‌ఐటీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించేందుకు టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ శనివారం కళాశాలకు రానున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటిస్తారని అన్నారు.

తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



బాడంగి: వర్షాలకు తడిచిన ధాన్యాన్ని రంగు మారక ముందే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బొమ్మినాయుని అప్పలనాయుడు కోరారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటలను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని అధికారులను కోరారు. ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు సమకూర్చాలని సూచించారు. తుపాను ప్రభావం మండలంలో పెద్దగా లేదని, 8 గ్రామాల్లో సుమారు 14 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లిందని ఏఓ శిరీష చెప్పారు. రైతులు తడిచిన చేనుపై ఉప్పుద్రావణం పిచికారీ చేసి ఆరబెట్టడం ద్వారా మొలకలు రాకుండా ఉంటాయన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలి



ఇళ్ల నిర్మాణాలపై ఈఈలతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి

బాడంగి: సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులకు నిర్దేశించిన గృహనిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాని, లేదంటే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు అన్నారు. ముగడ గ్రామంలోని జగనన్న కాలనీలో శుక్రవారం హౌసింగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాయంలో గృహనిర్మాణాల ప్రగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ ఏఈ సత్యం మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 1453 ఇళ్లు మంజూరు కాగా, 1065 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు చెప్పారు. జనవరి నెలాఖరుకు 152 ఇళ్లు పూర్తిచేయించి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి బాటలు వేయాలి



వంగర: మాట్లాడుతున్న ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ

వంగర: గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. నిధుల వినియోగం, గ్రామసభల నిర్వహణ, ఇంటి పన్ను వసూళ్లు వంటి అంశాలపై చర్చించారు. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ లోపింటి త్రినాథ్, ఈఓపీఆర్డీ జి.విజయకుమార్ పాల్గొన్నారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి

మెంటాడ: సచివాలయం పరిధిలోని కార్యదర్శులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎంపీడీఓ తివిక్రమ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల విధులు, ప్రజలకు అందించాల్సిన సేవలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓతో పాటు పంచాయతీ విస్తరణాధికారి విమల కుమారి ఉన్నారు.

రామభద్రపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ రమామణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల పాలనపై కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిచారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసినపుడే పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికల తయారీ, నిధుల సమీకరణతో పాటు వాటిని సక్రమంగా వినియోగించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఏవో అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



రాజాం: మల్లికార్జునస్వామి తిరువీధి నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు



రేగిడి: సంకిలి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రాజాం: కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పలు శివాలయాలు, విష్ణు ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమా రామలింగేశ్వర ఆలయం, మలికార్జునస్వామి ఆలయం, వల్లభనారాయణస్వామి ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. వైఎస్సార్ పార్కు చెరువు వద్ద పట్టణానికి చెందిన మహిళలు కార్తీక దీపారాధన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా తిరువీధి

రాజాం: కార్తీక ఏకాదశి సందర్భంగా రాజాం పట్టణంలోని సంతమార్కెట్‌లో కళ్యాణగౌరీ మల్లికార్జున స్వామివారి తిరువీధి ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తాణావీధి, కాలెపువీధి, మల్లికార్జునకాలనీ, మాధవబజార్, ఆదినారాయణకాలనీల మీదుగా ప్రధాన రహదారిలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మహిళలు ఘటాలతో ఆయలం వద్దకు చేరుకుని ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తిరువీధిలో పాల్గొన్నారు.

రేగిడి: మండలంలో సంకిలి, గుళ్లపాడు, ఖండ్యాం, మంగళిపేట, రేగిడి, వన్నలి, ఆమదాలవలస తదితర గ్రామాల్లో శివాలయాలు, విష్ణు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల అన్నసంతర్పణలు ఏర్పాటుచేశారు.

వన్నలిలో అన్నసంతర్పణ

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో అయ్యప్ప స్వాములు శుక్రవారం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. వన్నలితో పాటు ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, సంతకవిటి మండలం కృష్ణంవలస, కొండగూడేం, మాధవరాయపురం తదితర గ్రామాలు నుంచి సుమారు 3 వేల మంది అయ్యప్ప భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలి



మానవహారం నిర్వహిస్తున్న అఖిలభారత విద్యార్థి సమాఖ్య సంఘం

రాజాం సిటీ: రాజాంలో ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటుచేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య నేతలు శుక్రవారం ధర్నా చేపట్టారు. అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేసి ఆందోళన చేశారు. ఈ ప్రాంతానికి చెందిన సుమారు 20 వేల మంది విద్యార్థులు, ప్రయాణికులు బస్‌పాస్‌ల కోసం శ్రీకాకుళం, పాలకొండ డిపోలకు వెళ్లాల్సి వస్తోందని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు రాజాంలో బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సునీల్, ఎస్.నాగభూషణం, సహాయ కార్యదర్శి బి.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.హరికృష్ణ, రాజాం నియోజకవర్గ కన్వీనర్ బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నష్టం నుంచి గట్టెక్కేందుకు..



పొలాల్లో తడిచిన పంటను బయటకు తెస్తున్న రైతులు

రాజాం: మిచాంగ్ తుపాను ప్రభావం పూర్తిగా తొలగిపోవడంతో రైతులు పొలం పనుల్లో బిజీ అయ్యారు. పలువురు రైతులు వర్షాలకు తడిచిన వరి పనలను గట్టుకు చేర్చి ఆరబెడుతూ కనిపించారు. కొందరు వరి కుప్పలను నూర్పిడి చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు నేరుగా తరలిస్తున్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పలు గ్రామాల్లో పర్యటించి మొక్కజొన్న, పత్తి పంట నష్టాలను అంచనా వేయడంతో పాటు పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరిస్తున్నారు.